# పేరు తెచ్చిన ప్రళయం

రచన:
శ్రీ ఎం. వెంకటరెడ్డి.

'ఓరేయ్ భర్తా! అలా దిగులుగా ఉన్నావేం?'

ఏం చెయ్యమంటావ్ మాధవ్! రెండు నెలలు. తలచుకుంటేనే భయంగా ఉంది. అసలు యూనివర్సిటీ వారు శెలవు లివ్వటం ప్రత్యేకంగా మన భంధాన్ని తెగ్గొట్టటానికేనేమో అనిపిస్తుంది అన్నాడు నిర్లిప్తంగా మురళి.

'యీమాత్రం దానికి అంతగా చేలఅయిపోతావేం? శెలవలలో మీ ఊరు వస్తానన్నానుగా' అన్నాడు మాధవరావు.

'వస్తానంటే కుదరదు. తప్పకుండారావాలి! తెలిసిందా?'

'ఓ! భర్తగారు ఆజ్ఞవేసాక భార్యగారు రాక తప్పుతుందా?'

'యీ కబుర్లలో పడి ఆలశ్యం చేస్తే ట్రైను దాటిపోతుంది. వెళ్ళి సామాను సర్దుకోవమ్మా భార్యామణీ!' అన్నాడు మురళి.

మురళి, మాధవరావు యమ్. ఎ. క్లాస్ మేట్స్. వీరిద్దరూ ఒక రూములోనే ఉండేవారు. మొదట 'ఏమండీ'లతో ప్రారంభమయిన స్నేహం కొద్ది రోజులలోనే 'ఓరే!' గా మారింది. మురళి మాధవరావుని, 'మాధవీ!', 'భార్యా!' అని పిలిచేవాడు. మాధవరావు మురళిని 'భర్తా!' అని సంభోదించటం కూడా కద్దు. యీ విధంగా వీరి స్నేహము చిలువలూ పలవలూ అల్లుకొని గాఢంగా భందింప బడిపోయింది.

మురళి యింటికి తిరిగి వచ్చి వారం రోజులయింది. మురళి నాన్న పేరు ప్రసాద్ గారు. అమ్మగారి పేరు పార్వతమ్మ. ప్రసాద్ గారు ఆ ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి. మురళి వారికి ఒక్కగా నొక్క కుమారుడు అగుటచే గారాబంగా చూచేవారు.

ఒక రోజున మురళి హుషారుగా యింటికి తిరిగి వచ్చి కోపంతో ఎర్రగా మారిన ప్రసాద్ గారి ముఖంచూసి తక్కున ఆగిపోయాడు. సహజ శాంత స్వరూపుడు అయిన నాన్న ఎందుకు కోపంతో ఉన్నారో అనే విషయము ఆతని మనస్సుకు స్ఫురించలేదు. ఆయన కోపానికి కారకులెవరో ఊహించలేక పోయాడు.

మురళిని చూచుటతో ప్రసాద్ గారి కోపం మరింత అధికమయింది.

ఒరేయ్! యిలారా! అన్నారు ప్రసాద్ గారు.

మురళి భయపడుతూనే మౌనంగా తండ్రి వద్దకు వెళ్ళాడు. చెంప ఛెల్లుమంది. మురళి శరీరము గగుర్పాటు చెందినట్లయింది. 'నాన్నా!' అన్నాడు ఆత్రుతగా,

'ఛీ! నన్ను నాన్నా అని పిలువటానికి నీవు అర్హుడవు కాదు'

అసలేం జరిగింది నాన్నా!

'యింకేం జరగాలి. జరగవలసింది జరిగిపోయింది. నాకున్న పరువు - ప్రతిష్ట మంటలో కలిసి పోయాయి. నీలాంటి కొడుకు

పుట్టేకన్నా...' ప్రసాద్‌గారి కళ్ళల్లో నీరు నిండాయి.

తన తండ్రికి కన్నీరు ఎందుకు వచ్చిందో మురళి అణుమాత్రం అయినా ఊహించలేక పోయాడు.

'నాన్నా! ఏం జరిగింది.' అన్నాడు మురళి బాధగా.

'యిదుగో! యీ లెటర్‌కి నీ సమాధానం ఏమిటి?' అని ప్రసాద్‌గారు మురళికి ఒక లెటర్ యిచ్చారు.

తన తండ్రి కన్నీటికి కారణమయిన ఆ లెటర్‌లో ఏముందో అని ఆత్రుతగా విప్పి చదివాడు.

డియర్ మురళీ,

శెలవులలో యింటికయితే వెళ్ళాను కాని నిన్ను మర్చి పోలేక పోతున్నాను. దినం ఒక యుగంలా గడుపుతున్నాను. యీ పది రోజులూ బాధతో గడిపాను. యీ విరహం నేను భరించలేను. అందుచేతనే మీ ఊరు రెండు రోజుల్లో వస్తాను. నా కోసం స్టేషన్‌కి రా! యింతే సంగతులు.

యిట్లు
నీ
'మాధవి'

మరో సమయంలో అయితే ఆ లెటర్ చూసి బిగ్గరగా నవ్వే వాడేమో; కాని తండ్రి కోపం అతనిని నవ్వనీయకుండా చేసింది.

'ఏరా! యీ మాధవి ఎవరు? దీనికీ నీకూ సంభంధం ఏమిటి?'

'అదికాదు నాన్నా! యీ లెటర్...'

'ఏదికాదు? సరిగా చెప్పు. యీ మాధవి ఎవరు? ఎన్నాళ్ల నుంచి ప్రేమకలాపాలు సాగిస్తున్నావ్?

యీ లెటర్ నా ఫ్రెండ్ మాధవరావు వ్రాసాడు నాన్నా! అతన్ని నేను మాధవీ అని పిలుస్తుంటా...

నన్నే బుకాయించాలని ప్రయత్నిస్తున్నావటరా! కాలేజీకి వెళ్ళి యిదేనటరా నువ్వు చెయ్యవలసిన పని. ఛీ! పాడు బ్రతుకు! అని ప్రసాద్‌గారు వేగంగా బయటకు వెళ్ళిపోయారు. ఏరా! మురళీ! ఆ ఉత్తరము నిజమేనా? అంది అప్పటివరకు మౌనంగా నిల్చొని ఉన్న పార్వతమ్మ.

అమ్మా! నువ్వు కూడా నన్ను అనుమానిస్తున్నావా? నీ కొడుకు ఎలాంటివాడో నీకు తెలవదా అమ్మా అని పార్వతమ్మను కౌగలించుకొని బావురుమన్నాడు.

ఏడవకు నడు! భోంచేద్దువుగాని.

నాకు భోజనము వద్దమ్మా! ఆకలిగా లేదు అనిభారంగా అడుగులు వేసుకుంటూ పార్కుకు వెళ్ళి ఓ మూల కూర్చున్నాడు.

మాధవరావుఎంతపనిచేసాడు! అసలుయిలా జరుగుతుందనుకొని ఉంటే అలెటర్ వ్రాయక పోనేమో? ఆ చనువు తనే అతనికి యిచ్చాడు. తనకి 'మాధవీ' అనుట యిష్టము. అందు చేతనే అతడు మాధవి అని సంతకముపెట్టాడు, ఏదేమైతేనేం, తండ్రి తన మాట నమ్మాడు. యీ ఆలోచనలతో లోకంమర్చిపోయాడు. టైముచూసాడు. పన్నెండుఅయింది. మెల్లగా అంగలు వెసుకుంటూ యిల్లు చేరాడు.

'ఏరా! యింత రాత్రి వరకూ ఎక్కడికి వెళ్ళావ్?' అన్నారు ప్రసాద్ గారు కోపంగా.

'పార్కులో కూర్చున్నాను'

'యింత రాత్రి వరకూ పార్కులో కూర్చున్నావా? అబద్ధమాడటాని కూడా అర్థముండాలి. చెప్పు! ఎక్కడ తిరిగి వచ్చావ్?' అని మురళి కాలర్ పట్టుకున్నారు ప్రసాద్ గారు.

'నిజం నాన్నా!'

నిజం! నువ్వు పెద్దవాడియి నన్ను ఉద్ధరిస్తావనుకున్నాను. కాని యిలా మారిపోతావని కలలో కూడా అనుకోలేరా. ఏం? యింకా అలా నిలబడ్డావ్? పో! నా కంటికి కనిపించకు ఫో!' అని తల పట్టుకొని కుర్చీలో కూలబడ్డారు.

మురళి ఆ మాటలు సహించలేకపోయాడు కాని నాన్నను తను ఏ విధంగా నమ్మించ గలడు? సమాధానం దొరకలేదు. అచట నిలువలేక పోయాడు. ఆ నిశ్శబ్ద వాతావరణం అతని గుండెల్ని పీల్చి పిప్పిచేసినట్లయింది. తన గదిలోకి వెళ్ళి మంచముపై పడున్నాడు. ప్రక్క గదిలోంచి మాటలు వినవచ్చాయి.

'నా కడుపున చెడపుట్టాడే వీడు. కాలేజీకి వెళ్ళి బుద్ధిగా చదువుకుని నా గౌరవ మర్యాదలు కాపాడుతాడనుకున్నాను గాని ప్రేమ కలాపాలలో పడతాడని నే నెప్పుడూ అనుకోలేదు.'

'అబ్బాయి అలాంటి వాడంటే నేను నమ్మలేకున్నాను'

'ఛ! నువ్వూరుకో!'

మురళి ఆ మాటలు విని నవ్వుకున్నాడు.

* * *

మరునాడు. 'ఏమండీ! మురళి కన్పించటం లేదు!' అంది పార్వతమ్మ కంగారుగా.

'నే చెప్పలేదటే ప్రొద్దెపొడిచిందో లేదో అప్పుడే షికార్లు? వీడు పూర్తిగా పాడయి పోయాడు' అన్నారు ప్రసాద్ గారు.

యింతలో 'మురళీ' అన్న పిలుపు వినిపించి ద్వారము వైపు చూసారు. నవయవ్వన యువకుడు సూట్‌కేస్ పట్టుకొని నిలబడి ఉన్నాడు.

'ఎవరు?' అన్నారు ప్రసాద్ గారు భారంగా.

'నా పేరు మాధవరావండి. మురళి ఉన్నాడా?'

ప్రసాద్ గారికి మాధవరావు మాటలు విన్పించలేదు. కుర్చీలో అలానే కూలబడి పోయారు. మాధవరావు ఏం జరిగిందో తెలియక నిశ్చేష్టుడై నిలబడి పోయాడు. మురళి ఆలస్యముగా స్టేషనుకు వెళ్ళాడు. ఇంతలో బండి వచ్చేసింది. మాధవరావు, తన స్నేహితుడు ప్లాట్‌ఫారంలో కనపడక పోయేసరికి, మురళి ఇల్లును మరొకరి సహాయము వల్ల చేరుకున్నాడు. మురళి మాధవరావును చూచి ఆనందించాడు. జరిగిన కథనంతా చెప్పాడు. స్నేహితులిద్దరూ, నవ్వుకొంటూంటే అది చూచి ప్రసాద్ గారు కూడా నవ్వాపుకో లేక నవ్వారు.

